# కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



తాండూర్ : మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

తాండూర్, డిసెంబర్ 16 : తాండూర్ జడ్పీ హైస్కూల్‌లో శనివారం 9, 10వ తరగతుల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల కమిటీ చైర్మన్, హెచ్ఎం శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు విషయాలను వివరించారు. భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా లక్ష్యాన్ని ఎన్నుకొని సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానాలిచ్చారు. ప్రతినెలా జరిగే సమావేశానికి తల్లిదండ్రులు హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

### కాసిపేటలో..

కాసిపేట, డిసెంబర్ 16 : కాసిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కెరీర్ గైడెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు విషయాలపై వివరించారు. అధికారులు తమ తమ మార్గదర్శకాలు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఏ అలీం, కాసిపేట ఎస్ఐ గంగారాం, హెచ్ఎం జీవరత్నం, వైద్యాధికారులు, ఆయా శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాసిపేట : అవగాహన కల్పిస్తున్న అధికారులు

# పీహెచ్‌సీలో సమయపాలనేది..?



వైద్యుడు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

కాసిపేట పీహెచ్‌సీలో వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కరు కూడా అందుబాటులో లేకపోవడంతో తిరిగి వెళ్లిపోతున్నామని వాపోతున్నారు. ఇలా ఒక్కరోజే కాదని, నిత్యం ఇదే తంతు కొనసాగుతున్నదని.., వైద్యులు రారని, వచ్చినా సమయపాలన ఉండదని.., దీంతో దవాఖాన సిబ్బందే రోగులకు మందులు ఇచ్చి పంపుతారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వైద్యాధికారి రవి కిరణ్‌ను వివరణ కోరగా, వైద్యులకు సమావేశాలు, ఇతర కార్యక్రమాలు ఉన్న కారణంగా ఆలస్యమైందని, మరోసారి సమస్య కాకుండా చూసుకుంటామని తెలిపారు.

**- కాసిపేట, డిసెంబర్ 16**

# ఓసీలో కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె



ఓసీలో ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

కాసిపేట, డిసెంబర్ 16 : మందమర్రి ఏరియా కళ్యాణిఖని ఓపెన్ కాస్ట్‌లో బ్లాస్టింగ్ సెక్షన్‌లో విధులు నిర్వహించే కాంట్రాక్ట్ కార్మికులు తమ విధులను బహిష్కరించి సమ్మె చేపట్టారు. సదురు ఓసీలోని ఆర్‌వీఆర్ కాంట్రాక్ట్ యాజమాన్యం తక్కువ వేతనం, తక్కువ బోనస్ చెల్లిస్తూ అన్యాయం చేస్తున్నాన్నని, తమకు న్యాయం చేయాలని కోరారు. గతంలో వేతనం పెంచి ఇస్తామని హామీ ఇచ్చిన యాజమాన్యం, ఇప్పుడు జీతాన్ని ఇంకా కోతలు పెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె చేస్తుండగా, బ్లాస్టింగ్ పనులను ఇతరలను తీసుకెళ్లి చేయిస్తునానరని, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# బాల్యానికి భరోసా

- బడిబయటి పిల్లల కోసం ప్రత్యేక సర్వే
- ఈ నెల 11 నుంచి జనవరి 10 వరకు నిర్వహణ
- విద్యాశాఖ మార్గదర్శకాలతో కొనసాగిస్తున్న సీఆర్పీలు
- వివరాలు ప్రబంధ్ పోర్టల్‌లో అప్‌లోడ్

***బడి బయట ఉన్న పిల్లలను*** *గుర్తించి స్కూల్లో చేర్పించి, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేందుకు విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 11 నుంచి వచ్చే ఏడాది జనవరి 10వ తేదీ వరకు బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు సర్వే చేపట్టింది. వివరాలు అప్‌లోడ్ చేసేందుకు ప్రబంధ్ పోర్టల్‌ను ప్రత్యేకంగా రూపొందించింది. అందుకు తగ్గట్లుగా విద్యాశాఖ అధికార యంత్రాంగం పిల్లలను గుర్తించిన వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నది. ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ప్రతీ కాంప్లెక్స్ పాఠశాల పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు(సీఆర్పీ) బాధ్యత అప్పగించింది.* **- తాండూర్, డిసెంబర్ 16**





సర్వే చేస్తున్న సీఆర్పీలు తిరుపతి, నాగరాజు

తాండూర్ మండలంలో 40 ఎంపీపీఎస్, యూపీఎస్, జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ, జ్యోతిబా పూలే (బాలురు) పాఠశాలలు ఉండగా, అందులో 3,259 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సీఆర్పీలు ఇంకా బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి, వారి వయస్సును బట్టి ఆయాస్థాయి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టనున్నారు. గత విద్యాసంవత్సరం నిర్వహించిన సర్వేలో ఆరుగురు పిల్లలను గుర్తించి, ఆయా గ్రామాల్లోని పాఠశాలలోల చేర్పించి విద్య అందించినట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ తెలిపారు.

### 11 నుంచి ప్రారంభమైన సర్వే..

ఈ నెల 11 నుంచి సీఆర్పీలు తమ పరిధిలోని గ్రామాల్లో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించే పనిని ప్రారంభించారు. జనవరి 10 వరకు ఈ కార్యక్రమం కొనసాగనున్నది. సర్వేల్లో బడిబయట ఉన్న 6 నుంచి 14, 15 నుంచి 19 ఏండ్ల పిల్లలను గుర్తించి, విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రబంధ్ పోర్టల్‌లో రోజు వారీ వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రతి రోజూ ఆయా క్లస్టర్ పరిధిలో ఎంత మంది పిల్లలను గుర్తించారనే విషయాన్ని నమోదు చేస్తున్నారు.

### మూడుస్థాయిల్లో గుర్తింపు..

బడిబయటి పిల్లలను గుర్తించేందుకు మండల వ్యాప్తంగా 3 కాంప్లెక్స్‌కు సంబంధించిన నలుగురు సీఆర్పీలు సర్వే చేస్తున్నారు. సీఆర్పీ సేకరించిన సమగ్ర సమాచారం మొదటిస్థాయిలో ఆ యా కాంప్లెక్స్ పరిధిలో కాంప్లెక్స్ హెడ్ మాస్టర్, రెండో స్థాయిలో మండల విద్యాశాఖ అధికారి, మూడో స్థాయిలో జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో జరుగునున్నది. ఈ క్రమంలో చేపట్టిన సర్వేల్లో బడిబయటి పిల్లల గుర్తింపు పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

### సర్వే సమగ్రంగా నిర్వహిస్తున్నాం..



*విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 11 నుంచి జనవరి 10వ తేదీ వరకు బడిబయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు సమగ్ర సర్వే నిర్వహిస్తున్నాం. కాంప్లెక్స్ వారీగా సీఆర్పీలతో పూర్తిస్థాయిలో చేపడుతున్నాం. అందుకు 3 కాంప్లెక్స్ పరిధిలోని సీఆర్పీలను వినియోగిస్తున్నాం. 6 నుంచి 19 ఏండ్ల మధ్య వయస్సున్న బడిబయటి పిల్లలను గుర్తించి, ప్రతి రోజూ ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. మండలంలో బడిబయటి పిల్లలను పూర్తిస్థాయిలో పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా పనిచేస్తాం. బడిమానేసిన పిల్లల వివరాలు సేకరించి, సమీప పాఠశాలల్లో చేర్పిస్తాం. 15 నుంచి 19 ఏండ్ల పిల్లలను గుర్తించి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో చేర్పిస్తాం. బడిబయట పిల్లలు లేకుండా చేయాలన్నదే సర్వే ఉద్దేశం. సీఆర్పీలు గ్రామాల్లో పర్యటించి, చదువుకోలేని, బడి మానేసిన, బడికి వెళ్లలేని పిల్లల వివరాలు సేకరిస్తున్నాం. సర్వేను నాతో పాటు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.* **- వాసాల ప్రభాకర్ ఎంఈవో, తాండూర్**

# బడీడు పిల్లలపై సర్వే



కాసిపేట : సర్వే చేస్తున్న సీఆర్పీ మంతెన రమేశ్

నెన్నెల, డిసెంబర్ 16 : మండలంలోని పలు గ్రామాలోల సీఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు బడీడు పిల్లలపై సర్వే చేస్తున్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చేపట్టిన ఈ సర్వేలో బడి బయట ఉన్న బడీడు పిల్లలను గుర్తిస్తున్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. 6 నుంచి 14 ఏండ్లలోపు, 15 నుంచి 19 ఏండ్ల లోపు ఉన్న పిల్లలను గుర్తిస్తున్నారు. వారి వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని సీఆర్పీలు చెప్పారు. కార్యక్రమంలో సీఆర్పీలు రాజేశ్, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ పాల్గొన్నారు.

### దేవాపూర్‌లో..

కాసిపేట, డిసెంబర్ 16 : కాసిపేట మండలం దేవాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని రాంపూర్ గ్రామంలో సీఆర్పీ మంతెన రమేశ్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. డ్రాపౌట్ పిల్లల వివరాలు నమోదు చేసుకున్నారు. డ్రాపౌట్ బాలికను గుర్తించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కలిపంచారు. తప్పకుండా పాఠశాలకు పంపాలని, అక్కడ కల్పించే సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈఆర్పీ చందు, రాంపూర్ హెచ్ఎం సత్తయ్య పాల్గొన్నారు.

# రోడ్డుకు మరమ్మతులు చేయండి

నెన్నెల, డిసెంబర్ 16 : నెన్నెల నుంచి మన్నెగూడెం వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెన్నెలలోని నేతకాని వాడలో సీసీ రోడ్డు పూర్తిగా పగుళ్లు తేలి అస్తవ్యస్తంగా తయారైంది. నిత్యం పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయని, గుంతల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ రోడ్డు నెన్నెల, జంగాల్‌పేట రోడ్డు పరిధిలో ఉన్నది. ఇటీవల రోడ్డు మరమ్మతులు చేపడుతున్నప్పటికీ ఈ రోడ్డు సరి చేయలేదు. పలు గ్రామాల ప్రజలు సీసీ రోడ్డు గుంతలు మరమ్మతులు చేయాలని అధికారులను కోరుతున్నారు.



నెన్నెల-మన్నెగూడెం రోడ్డుపై ఏర్పడిన గుంతలు